# ప్రేమతో 'సాయీ' అని పిలిచితే 'ఓయీ' అని పలుకుతాను

*పరమ పావనమైన భారతావనియందు*
*సహనమన్నదె మనకు చక్కదనము*
*వ్రతములన్నింటను వన్నెగాంచినయట్టి*
*ఘనసత్యశీలమే కఠిన తపము*
*మధుర భావంబేది మన దేశమందన్న*
*మాతృభావము కంటె మాన్యమెద్ది*
*ప్రాణంబు కంటెను మానంబె ఘనమను*
*మన దేశ నీతిని మంటగలిపి*
*నేటికిచ్చిరి పరదేశ నీతులరసి*
*వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి*
*ఔర! ఏమందు భరత పాలనంబు*
*ఏనుగెట్టుల తన బలమెరుగలేదొ*
*అట్టులైనారు భారతీయులు నేడు.*

ప్రేమస్వరూపులారా! ఈనాటి మానవునకు సహనమంటే ఏమిటో తెలియక పోవుచున్నది 'పరమ పావనమైన భారతావనియందు సహనమన్నదె మనకు చక్కదనము.' ఈ సత్యాన్ని మానవుడు గుర్తించుకోలేకపోతున్నాడు. దీనులు, వికలాంగులపట్ల తాను సహన సానుభూతులను చూపించవలసిందిపోయి వారిని అసహ్యించుకుంటున్నాడు. సహనము లేని మానవుడు మానవుడే కాదు. నిజముగా మన భారతీయులకు సహనమనేది గొప్ప విలువైన మంత్రము. ఇటువంటి పవిత్రమైన మంత్రమును వదిలి, యంత్రతంత్రములను విశ్వసించి మానవుడు అమాయకత్వంలో, అజ్ఞానంలో మునిగిపోతున్నాడు. భక్తి, భక్తి, భక్తి.. ఏమిటి దీని అర్థము? ఏవో పూజలు చేయటము, వ్రతములు ఆచరించటం ఇత్యాది సత్కర్మలను భక్తికి చిహ్నములుగా భావిస్తున్నారు. భక్తులకు ముఖ్యంగా కావలసినది సహనమే! సహనమును ఆచరణలో పెట్టటమే భారతీయులయొక్క ప్రధాన కర్తవ్యము. సహనము చాలా ఉత్తేజకరమైనది. ఉల్లాసకరమైనది; మనం ఆచరించి ఇతరులకు బోధించవలసినది. "వ్రతములన్నిటి యందు వన్నెగాంచినయట్టి ఘన సత్యశీలమే కఠినతపము" సత్యశీలమే నిజమైన తపస్సని ఈనాటి మానవుడు మరచిపోయాడు. "మధురభావంబేది మనదేశమందన్న మాతృభావముకంటె మాన్యమెద్ది?" ఈనాడు మాతృభావమును మరచిపోతున్నారు. మాతృభావము కంటే మధురమైనది ఈ జగత్తులో ఎక్కడనూ కానరాదు. మధురమైన మాతృప్రేమను సంపాదించుకున్నవాడు మహా అదృష్టవంతుడు. ఈ మధురభావము ఎక్కడో వెతికితే మనకు లభించేది కాదు; డబ్బుతో కొనేది కాదు బాడుగకు తీసుకునేది కాదు. మధురభావము మధురప్రేమనుంచే వస్తుంది.

**ప్రేమగల మానవునికి ఎట్టి లోటూ కలుగదు**

ప్రేమస్వరూపులారా! ప్రేమకు మించిన పవిత్రమైన గుణము ఈ జగత్తులో ఎందు వెతికినా కానరాదు. లౌకికమైన, భౌతికమైన ప్రేమ ఈనాడు ఎక్కడైనా చిక్కుతుందిగాని, ఆత్మానందముతో కూడిన ప్రేమ మనకు

లభించటము చాలా కష్టము. ప్రేమ అంటే ఒకరి నొకరు ప్రేమించుకోవటం కాదు. హృదయాన్ని ఇచ్చి హృదయాన్ని పుచ్చుకునేది ప్రేమ. కాని, అలాంటి పవిత్రమైన భావమును ఈనాడు భారతీయులు మరచిపోతున్నారు. అనాదికాలమునుండి పవిత్రమైన మన భారతదేశమునందు మనలను కంటికిరెప్పవలె అన్నివిధాలుగా కాపాడుతూ వచ్చింది దైవప్రేమ.

అట్టి దైవప్రేమను ఈనాడు మనం ఎక్కడ పెట్టేమో ఏమో గ్రహించు కోలేకపోతున్నాము. ఇందు కలదని, అందు లేదని చెప్పటానికి వీలుకాదు. ఎందు చూసిన అందే కనిపించుచున్నది. ఈ జగత్తులో దైవప్రేమ తప్ప ఏ ప్రేమకూడా సత్యము కాదు. ఈ కనిపించే ప్రేమలన్నీ బూటకములు. నిజమైన ప్రేమ మన నాభినుండి ఆవిర్భవిస్తుంది. అదియే నాకు చాలా ఇష్టము. లౌకికమైన, భౌతికమైన ప్రేమలు కావసినన్ని లభిస్తాయి మనకు. వీటన్నింటినీ ప్రేమ అని పిల్చుటకు అర్హత లేదు. ప్రేమ హృదయమునుండి రావాలి. అట్టి ప్రేమను మీరు బలపరచుకోండి. ప్రేమగల మానవునకు ఎట్టి లోటూ కలుగదు. ఇట్టి ప్రేమను మీరు సంపాదించుకున్నప్పుడే ప్రేమస్వరూపులనే బిరుదు మీకు సార్థకమవుతుంది.

## నీలోనే ఉన్న దైవాన్ని నీవు మరచిపోవద్దు

దైవము సర్వత్రా ఉన్నాడు. దైవము ఎవరు? నీవే దైవము. ఇట్టి అనుభూతిని మనం పొందాలి. దైవము ఎందు చూచిన అందే ఉన్నాడు. నీలోనే ఉన్న దైవాన్ని నీవు మరచిపోవద్దు. దైవము ప్రత్యేకించి ఉన్నాడని భావిస్తుంటారు చాలామంది.

*"ఇందు గలడందు లేదని*
*సందేహము వలదు చక్రి సర్వోపగతుం*
*డెందెందు వెదకి చూసిన అందందే గలడు..."*

అని చెప్పాడు ప్రహ్లాదుడు. భారతీయసంస్కృతి బోధిస్తున్నది ఇదియే! "దైవం, దైవం, దైవం..." అంటున్నావు. అసలు నీవే దైవం. నీవు వేరు, దైవము వేరు కాదు. తనయందున్న దైవాన్ని విస్మరిస్తున్నాడు మానవుడు.

ప్రేమస్వరూపులారా! మీరు దేనిని ఆశించినా, ఆశించకపోయినా ప్రేమను మాత్రం మీరు వదలకూడదు. ప్రేమకు మించిన ధనము మరొకటి లేది. ప్రేమయే గొప్ప పెన్నిధి. ప్రేమను మరచినవాడు మానవుడే కాదు. తల్లిని, తండ్రిని సోదరీ సోదరులను ప్రేమిస్తున్నాము. కాని, ఇవి భౌతికమైన నాటకానికి సంబంధించిన ప్రేమలు. నిజమైన ప్రేమను మనం గుర్తించటానికి ప్రయత్నించాలి. దానిని మనం వెతుకనక్కర్లేదు. అది ఎప్పుడూ మన ఇంటనే, వెంటనే, జంటనే కనిపిస్తున్నది. (ఒక పుష్పమును చూపిస్తూ) ఇది ఏమిటి? ఇదొక పుష్పము. ఈ పుష్పము సామాన్యమైనది కాదు. ఇది భగవంతుని హృదయంతో కూడినటువంటిది. దీనికి ఎన్నియో రేకలుంటున్నాయి. ఈ రేకలే భగవంతునియొక్క లేఖలు. అన్నింటికీ ఆధారము ఒక్కటే. అదియే మూలాధారమైన ఆత్మ. ఆత్మనే ప్రేమ అని పిలుస్తూ వచ్చారు. దానిని మరొకరీతిగా పిల్చుటకు వీలుకాదు. ఈ ఆత్మకే అనేకరకములైన ప్రేమలు చేర్చుతున్నారు. తల్లి, తండ్రి, సోదరి, సోదరుడు...అందరూ పుష్పముయొక్క రేకలే! అందరూ చేరినదే కుటుంబము. అయితే, నీవు ఒక్క కుటుంబములో ప్రేమగా ఉంటున్నంత మాత్రమున చాలదు. విశ్వకుటుంబీకుడుగా కావాలి నీవు.

ఎవరిని చూసినా నమస్కారము చేయాలి. ఈ జగత్తులో కనిపించేవన్నీ దైవ స్వరూపములే! ఈ కనిపించేవన్నీ వస్తువులుగా నీవు భావిస్తున్నావు. ఇవన్నీ దైవస్వరూపములే అని గుర్తించు. ఈ ప్రపంచములో దైవత్వము లేనిది ఒక్కటీ మనకు కానరాదు. కాని, మనం పిచ్చివారమైపోయి దైవము ఎక్కడ, ఎక్కడ అని వెతుకుతున్నాము. ఎక్కడ చూసినా కనిపించునది దైవమే! సర్వము దైవస్వరూపమని భావించటము గొప్పతనము.

కనిపించేవన్నీ దైవస్వరూపములే. సర్వజీవులనూ, సర్వవస్తువులనూ దైవస్వరూపాలుగా మనం భావించాలి. వస్తుస్వరూపాన్ని విస్మరించి శక్తి స్వరూపాన్ని హృదయంలో పెట్టుకోవాలి. దైవము కానటువంటిది ఏదీ మనం అనుభవించటం లేదు. ఉదాహరణకు మనము నీరు త్రాగాము. నీరు త్రాగటం వలన ఏమి జరిగింది? దాహం తీరింది. కాబట్టి, నీరు కూడ దైవమే ! పంచ భూతములు, పంచేంద్రియాలు, పంచకోశములూ,పంచప్రాణములూ అన్నీ దైవస్వరూపములే! ఈనాటి మానవుడు తన ఇంద్రియాలను దుర్వినియోగం చేసుకుంటున్నాడు. ఇదే మానవుడు చేస్తున్న పాపము. మావనతావిలువలంటే మీరు ఏమనుకున్నారు? మానవతావిలువలే దైవగుణములు. దైవమునకు వేరే గుణములు లేవు. దైవమనే పదమే పెద్ద గుణము. అటువంటి గుణాతీతుడైన భగవంతుణ్ణి గుణములతో చూచుకొని మనం భ్రమిస్తున్నాము.

**ప్రేమయే భగవంతునియొక్క స్వరూపము**

ప్రేమస్వరూపులారా! నా నోటితో ఏమి పలికినా ప్రేమయే, ప్రేమయే! నాకు మరొక పదము తెలియదు. ప్రేమకు మించినది ఎక్కడా మనకు కానరాదు. అట్టి ప్రేమను మనం ప్రేమించుకుంటూ పోవాలి. అటువంటి ప్రేమకు మించిన భగవంతుడు మరొకడు లేదు. "నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం నిత్య శుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం.." ఈ పదములన్నీ మన తృప్తినిమిత్తమై పలుకుతున్నామేగాని, ఇవి భగవంతునికి వర్ణనలు కావు. భగవంతునికి ఒక్కటే గొప్ప వర్ణన... అదే ప్రేమ. ప్రేమకు వర్ణనే లేదు. కోపమునందుగాని, తాపమునందుగాని, కష్టమునందుగాని, దుఃఖమునందుగాని ఏ పరిస్థితియందైనా ప్రేమ ప్రేమయే! మీరందరూ ప్రేమస్వరూపులే! ఈ ప్రేమయే భగవంతునియొక్క ఆకారము. అట్టి ప్రేమను మనచెంత పెట్టుకొని లౌకికమైనవాటిగురించి చింతిస్తున్నాము మనము. అంగహీనులైన పిల్లలను ఆ ట్రైసికిళ్ళపైన పెట్టి తీసుకువెళుతుంటే నాకెంతో విచారమైంది. వారు దైవస్వరూపులు. అలాంటి దైవస్వరూపులను హీనులుగా భావించి వారిని చులకనగా చూస్తున్నారు. అసలు హీనులైనవారు లోకములో ఎక్కడా కానరారు. ఆ హీనమైన గుణము మనయందే ఉన్నది.

భగవంతుడు గుణాతీతుడు. అతని గుణము ఒక్కటే ఒక్కటి. ప్రేమయే అతని గుణము. ప్రేమయే అతని స్వరూపము. ఎవరైనా ప్రేమతో సంభాషిస్తే నాకు ఎంత ఆనందమో చెప్పలేను. ఆ ప్రేమ లేకుండా నన్ను వర్ణించటం నాకు నచ్చదు. కనుక నన్ను ప్రేమతో పలుకరించండి. ప్రేమతో పలికిన పలుకులకు అన్నింటికీ నేను తక్షణమే జవాబిస్తాను. ప్రేమతో 'సాయీ' అని పిలువు; 'ఓయీ' అని పలుకుతాను. ప్రేమ లేనటువంటి పిలుపు నన్ను ఏమాత్రము కదిలించలేదు. ప్రేమతో నన్ను పలుకరిస్తే నేను ఎప్పుడైనా పలుకుతాను. ప్రేమకు మించిన ప్రాణం మరొకటి లేదు. కనుక భగవంతుని మనం చూడాలనుకున్నా, అనుభవించాలనుకున్నా ప్రేమచేతనే సాధ్యమౌతుంది. ప్రేమచేతనే చూడండి. ప్రేమచేతనే పలుకరించండి. ఎంత ధనమున్నా, ఎంత గుణమున్నా అవి ప్రేమకు సాటిరావు. 'ప్రేమ' అనే రెండక్షరాలలో ఉన్న మాధుర్యము ఇంకెక్కడా కానరాదు. కాబట్టి, మీరు ప్రేమను ప్రధానంగా పెట్టుకోండి. ఎక్కడికి వెళ్ళినా ప్రేమయే మిమ్మల్ని కాపాడుతుంది.

అడవిలోననున్న ఆకసముననున్న
పట్టణముననున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేటనున్నను
ప్రేమించువానికి ప్రేమయే దిక్కు

ఇట్టి ప్రేమను మీరు సంపాదించుకోండి. ఈ ప్రేమ మనస్సు ఇస్తే లభిస్తుందిగాని, ధనము ఇస్తే లభించేది కాదు. ప్రేమయే నిజమైన భక్తి. ప్రేమ లేని 'డివోషన్' అది అసలు 'డివోషన్' కాదు. అది 'డీప్ ఓషన్.' ఆ ఓషన్' ఎలాంటిది?

ఉప్పునీరుతోకూడినది. కాని 'డివోషన్' అనేది 'స్వీట్ వాటర్'తో కూడినది. అనగా అమృతమయమైనది ఈ ప్రేమ. ఆనందమయమైనది ఈ ప్రేమ. ఇట్టి పవిత్రమైన ప్రేమను వదలి లౌకికమైన ప్రేమలను ఆశించడం వెఱ్ఱితనం!

ప్రేమస్వరూపులారా! భక్తి, భక్తి అని ప్రాకులాడే బదులు మీ ప్రేమను పవిత్రంగా పెట్టుకోండి. ప్రేమకు మించిన శక్తి మరొకటి లేదు. దానికి మించిన ముక్తి మరొకటిలేదు. శక్తి, భక్తి, ముక్తి, రక్తి, అనురక్తి అన్నీ ఒక్క ప్రేమయందే ఇమిడిఉన్నాయి. ఈ గురుపౌర్ణమినాడు నేను మీకందించే అమూల్యమైన బహుమానము ఒక్క ప్రేమ మాత్రమే! మీలో ఈ ప్రేమయే లేకుండిన నేను ఏది ఇచ్చినా దానికి ఫలితముండదు. నా ప్రేమ పవిత్రమైనది. ఇట్టి ప్రేమను మీరు అభివృద్ధి పరచుకోండి.

(2-7-2004 ఉదయం గురుపూర్ణిమ నాడు సాయికుల్వంత్ సభామండపములో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)